# విశ్వసనీయత పెంచుకుంటున్న విదేశీ ఎంబీబీఎస్



**వైద్యవిద్యపై ఆసక్తి ఉండీ ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాని విద్యార్థులు తమ అభీష్టం నెరవేర్చుకునే అవకాశం విదేశాల్లో లభిస్తోంది! అక్కడి విద్యాసంస్థల్లో చేరాలంటే ప్రవేశపరీక్ష రాయనక్కర్లేదు. డొనేషన్ల బెడద కూడా లేదు. దీంతో పరిమిత బడ్జెట్లోనే విద్యార్థుల ఎంబీబీఎస్ కల నిజమవుతోంది!**

ఇంటర్మీడియట్‌ను బైపీసీ గ్రూపుతో చదివిన విద్యార్థులు వైద్యవిద్యలో చేరాలన్న తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే... సుమారుగా నాలుగు వేల కంటే తక్కువ ర్యాంకు వచ్చివుండాలి. మన రాష్ట్రంలో అయినా, పక్క రాష్ట్రంలో అయినా లక్షల్లో డొనేషన్లు కట్టగలిగేవారికి మాత్రమే యాజమాన్య కోటా అందుబాటులో ఉంటుంది. ఇంకా వేల మంది విద్యార్థులు వైద్యవిద్య చదవాలనే తమ ఆకాంక్షలను పక్కనపెట్టాల్సివస్తోంది.

కొద్ది సంవత్సరాలుగా భారతీయ విద్యార్థులను విదేశీ వైద్యవిద్య ఆకర్షిస్తోంది. పూర్తి అవగాహనతో విదేశాలకు వెళ్ళి వైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. మన రాష్ట్రంలో, ఇతర ప్రాంతాల్లో వైద్యవిద్య అభ్యసించటానికి వీలుపడని వేలమంది విద్యార్థులకు విదేశీ వైద్యవిద్య చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది.

ఇలాంటి విద్యార్థులకు... ఇప్పటికే చాలామంది విదేశాల్లో వైద్యవిద్యను పూర్తిచేసుకుని, డిగ్రీ పట్టా చేతపట్టుకుని రావటం, స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణులై కళ్ళముందు కనిపిస్తుండటం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఆ విధంగా విదేశీ వైద్యవిద్య తన విశ్వసనీయతను ఒక్కో మెట్టు పెంచుకుంటోంది.

గతంలో విదేశాల్లో చదవగోరే విద్యార్థులకు ఏయే దేశాలు, ఏయే విశ్వవిద్యాలయాలు వైద్యవిద్యను అందిస్తున్నాయో, అక్కడున్న ప్రమాణాలు ఏమేరకు ఉన్నాయో తెలుసుకోవడం కొంచెం కష్టంగా ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. రష్యా, కిర్గిజిస్థాన్, ఫిలిప్పైన్స్, చైనా, ఉక్రెయిన్, జర్మనీ దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాలు విద్యార్థులను ఎంబీబీఎస్ చదవటం కోసం ఆహ్వానిస్తున్నాయి.

కన్సల్టెన్సీలు ఇచ్చే సమాచారంతో పాటు ప్రస్తుతం అక్కడే చదువుతున్న విద్యార్థులతో చర్చించి, ఒక నిర్ణయం తీసుకోవడం ఇప్పటి విద్యార్థులకు తేలికయిందని చెప్పవచ్చు. తగిన జాగ్రత్తలు తీసుకుని, పూర్తి అవగాహనతో విదేశాలకు వెళ్ళి వైద్యవిద్యను అభ్యసించగలిగితే డాక్టర్ కావాలనే కోరిక నెరవేర్చుకోవచ్చు. గౌరవప్రదమైన వృత్తిలో స్థిరపడి స్వదేశంలో వైద్యసేవలందిస్తూ ఎందరి ప్రాణాలనో నిలబెట్టవచ్చు.

## ఏమేం తెలుసుకోవాలి?

**గుర్తింపును నిర్ధారించుకోవడం:**

విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ముందుగా ఓ దేశాన్ని, ఆ దేశంలో కళాశాలను ఎంపిక చేసుకోవాలి. ఇందుకు భారతీయ వైద్య మండలి మార్గదర్శకాలనూ, సూచనలనూ తెలుసుకోవాలి. ప్రపంచ ఆరోగ్యసంస్థ తన డైరెక్టరీలో పొందుపరిచిన దేశాలవారీగా కళాశాలల జాబితాను చూసి, అందులో నమోదైన కళాశాలను ఎంపిక చేసుకోవాలి. వెబ్‌సైట్: www.who.int/hrh/wdms/en

చైనాకు సంబంధించి భారతీయ వైద్యమండలి అనుమతించిన కళాశాలల జాబితాను ప్రత్యేకంగా వెబ్‌సైట్‌లో చూడవచ్చు www.mciindia.org

**ఎంసీఐ అనుమతి:**

విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించేందుకు వెళ్ళే ముందు భారతీయ వైద్యమండలి అనుమతి (ఎలిజిబిలిటీ సర్టిఫికెట్) తప్పనిసరిగా తీసుకోవాలి.

**అనుమతికి నిబంధనలు:**

1. విద్యార్థులు భారతీయులై ఉండాలి. 2. ప్లస్ టూ లేదా ఇంటర్మీడియట్ కోర్సులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు ఆంగ్లం ఒక బోధనాంశంగా చదివి, 50 శాతం ఉత్తీర్ణత ఉండాలి (బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ వారికి 40 శాతం మాత్రమే). 3. విద్యార్థి వయసు 17 సంవత్సరాలు (అదే సంవత్సరం డిసెంబర్ 31 నాటికి) నిండివుండాలి.

**వైద్యపట్టాల మధ్య వ్యత్యాసం?**

మనదేశంలోని వైద్యపట్టాకూ, విదేశీ వైద్యపట్టాకూ వ్యత్యాసం లేదు. రెండు డిగ్రీలూ సమానమే. అయితే విదేశాల్లో డిగ్రీని పొంది స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ప్రాక్టీసు పెట్టుకోవడానికీ, ఉద్యోగం చేయటానికీ, అదే డిగ్రీతో ఉన్నత విద్య చదవడానికీ నేరుగా వీలులేదు. భారతీయ వైద్యమండలి స్క్రీనింగ్ టెస్టు (ఎఫ్.ఎం.జి.) పాసవ్వాలి.

**స్క్రీనింగ్ టెస్టు వివరాలు:**

విదేశాల్లో వైద్య విద్యార్థులను భారతీయ వైద్యులుగా పరిగణించేందుకు ఏర్పాటైన పరీక్ష ఇది. దీన్ని ఏడాదికి రెండుసార్లు- మార్చి, సెప్టెంబరుల్లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారు ప్రతి ఏడాదీ నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. ఒకసారి ఉత్తీర్ణులు కాకపోయినా తిరిగి రాసే వెసులుబాటు ఉంది.

స్క్రీనింగ్ టెస్టులో పాసైనతర్వాత ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఎంసీఐ ప్రదానం చేస్తుంది. స్క్రీనింగ్ టెస్టు ఉత్తీర్ణులైన విద్యార్థులు భారత్‌లో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థుల మాదిరే ఎంసీఐ నిర్దేశిత నిబంధనలనూ, పద్ధతులనూ పూర్తిచేయాల్సివుంటుంది. అది పూర్తయ్యాక పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (లైసెన్స్) వస్తుంది.

**ఈ పరీక్ష నుంచి మినహాయింపు?**

గతంలో నేపాల్లోని కొన్ని కళాశాలలకు ఈ పరీక్ష నుంచి మినహాయింపు ఉండేది. ప్రస్తుతం ఆ మినహాయింపు ఏ దేశానికీ, ఏ కళాశాలకూ లేదు.

## ముఖ్యమైన జాగ్రత్తలు

- చదవటానికి ఎంపిక చేసుకున్న దేశానికి సంబంధించిన చట్టాలను గౌరవించాలి. సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకోవాలి.
- ఆ కళాశాలలో ఆంగ్లమాధ్యమం ఏ మేరకు బోధన జరుగుతున్నదీ పూర్వ విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి.
- ఫీజు, ఇతరత్రా ఖర్చుల పట్ల తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉండాలి.
- వాతావరణ పరిస్థితులు ముందుగా తెలుసుకోవడం మంచిది. అందుకు సరిపడా దుస్తులను సమకూర్చుకోవడం తప్పనిసరి.
- ఆ దేశంలో ఆహార నియమాలు తెలుసుకోవాలి. భారతీయ ఆహార లభ్యతను నిర్ధారించుకోవాలి.
- జీవిత బీమా, ప్రయాణ బీమా చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం.

## పాస్‌పోర్టు సంగతి?

పాస్‌పోర్ట్ పొందటానికి వయఃపరిమితి లేదు. జన్మదిన ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువపత్రాలు, టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలను జత చేసి, పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. త్వరగా పాస్‌పోర్టు కావాలనుకుంటే తత్కాల్ పథకంలో పొందవచ్చు. వెబ్‌సైట్: www.passport.nic.in

ఓ ముఖ్య విషయం- పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాన్ని గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ లేదా జనన మరణ రిజిస్ట్రార్ అధికారులనుంచి పొందాలి. (1989 జనవరి 26 తర్వాత జన్మించినవారి విషయంలో పదో తరగతి మార్కుల జాబితాలో పొందుపరిచిన తేదీని పరిగణనలోకి తీసుకోవడం లేదు).

### విదేశీ వైద్యవిశ్వవిద్యాలయాల్లో ట్యూషన్ ఫీజు

| దేశం | కోర్సు వ్యవధి | ఏడాదికి ఫీజు | ఏడాదికి సగటు ఫీజు |
|---|---|---|---|
| కిర్గిజిస్తాన్ | 4+1 ఏళ్ళు | 2200 డాలర్లు | రూ. 1.03 లక్షలు |
| చైనా | 4 1/2 +1 ఏళ్ళు | 4200-4500 డాలర్లు | రూ.1.97- 2.10 లక్షలు |
| ఫిలిప్పీన్స్, సెంట్రల్ అమెరికన్-కరీబియన్ దీవులు | 4 1/2 +1 ఏళ్ళు | 4200-5000 డాలర్లు | రూ.1.97- 2.35 లక్షలు |
| రష్యన్ దేశాలు (రష్యా, బెలారస్, ఉక్రెయిన్, కజక్‌స్తాన్, తజికిస్తాన్) | 6 ఏళ్ళు | 3500-4000 డాలర్లు | రూ.1.65- 1.88 లక్షలు |